సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 22। మే। 2025



ఎందుకీ తెలుగు ద్వేషం?

తెలుగు భాషపై ప్రభుత్వ వైఖరిని టీచర్లు దునుమాడుతున్నారు. భాషాభిమానులు కూడా మండిపడుతున్నారు. - 8లో



అవగాహనతోనే..

విత్తనాల ఎంపికలో అవగాహన అవసరం. కొన్నప్పుడు రశీదు తీసుకోవడం తప్పనిసరి. - 8లో

శ్రీముఖలింగం దేవాలయ భూముల కౌలు వేలం వాయిదా

జలుమూరు: శ్రీముఖలింగం దేవాలయ భూముల కౌలు వేలం వాయిదా పడింది. బుధవారం ఈఓ కార్యాలయంలో సుమారు 32 ఎకరాలకు సంబంధించి కౌలుకు వేలం నిర్వహించగా తక్కువ మంది రైతులు వేలంపాటకు రావడంతో వేలంపాట వాయిదావేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. తదుపరి తేదీ నిర్ణయించి వేలం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

జాతీయ రహదారిపై పెట్రోలింగ్ తప్పనిసరి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జాతీయ రహదారి మార్గంలో ప్రత్యేక కార్యాచరణతో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైవే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, సహాయక చర్యలు, రహదారి భద్రత, అత్యవసర సమయాల్లో స్పందించడం హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. రోడ్డుకు ఇరువైపులా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. సర్వీసు రూట్ మార్గంలో వ్యతిరేక దిశలో వచ్చే వాహనాలను నియంత్రించాలన్నారు. హైవే మార్గంలో ధాబా, హోటల్స్ నిర్ణీత సమయానికి క్లోజ్ చేయించాలన్నారు. వేకువజామున సమయాల్లో టోల్‌ప్లాజా, చెక్‌పోస్టులు వద్ద వాహనదారులతో ఫేష్‌వాష్ చేయించాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది రేడియం జాకెట్లు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎంవీ అప్పారావు, సిఐలు పైడపు నాయుడు, అవతారం, శ్రీనివాస్, విజయ్‌కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.

టీచర్ల సందేహాలకు హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి విద్యాశాఖ హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జీఓ నంబర్ 22తో మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల ప్రజాపరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలోని ఉపాధ్యాయులు బదిలీల సందర్భంలో ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసే సమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలు, సందేహాల నివృత్తి కోసం టెక్నికల్ టీంతో మాట్లాడవచ్చని డీఈఓ కార్యాలయం పేర్కొంది. 9703148269, 8143142450, 9000907101 నంబర్లను సంప్రదించాలని డీఈఓ తిరుమల చైతన్య వెల్లడించారు.

మైక్రో క్రెడిట్ ప్లాన్ అమలు చేయాలి



సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం పైడి కూర్మారావు

మందస: రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఏడాది మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళికలో మైక్రో క్రెడి ట్ ప్లాన్ పక్కాగా అమలు జరగాలని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస మండలంలో కొత్తపల్లి పంచాయతీ ముకుందాపురం గ్రామంలో సభ్యుల సూక్ష్మ రుణ ప్రణాళికను పరిశీలిస్తూ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసినప్పుడు బయోమెట్రిక్ కూడా తీసుకోవాలని తెలిపారు. సభ్యులు తీసుకున్న రుణాలను 70 శాతం అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ బాడ చంద్రకళ, క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, తారక్ మోమన్ తదితరులు పాల్గొన్నారు.





కేశవరావు(ఫైల్)

సొంతూరికి దూరంగా దాదాపు నాలుగు దశాబ్దాల అజ్ఞాత వాసం ముగిసిపోయింది. ఎంటెక్ చదివినా ఏళ్లకు ఏళ్లు చేసిన అరణ్య వాసం పూర్తయ్యింది. కలాన్ని వదిలి తుపాకీ చేతబట్టిన ఆయన జీవితం ఆ తుపాకీ గుళ్లకే బలైపోయింది. జియ్యన్నపేటలో పుట్టి.. టెక్కలిలో చదివి.. వరంగల్‌లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లి.. ఆపై అడవిలో అన్నగా మారిన నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రస్థానం ముగిసిపోయింది. చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కేశవరావు హతమయ్యారు. ఈ ఘటనతో సిక్కోలు ఉలిక్కిపడింది.

శ్రీకాకుళం టు సుప్రీం కమాండర్

- నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాళ్ల కేశవరావు హతం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, పలాస :

నలభై ఏళ్ల కిందట ఓ విద్యార్థి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి.. తన వాటా ఆస్తి రాసిచ్చేయాలని టీచరైన తండ్రిని కోరారు. ఎందుకని అడిగితే ఆస్తి ఇస్తే.. పేదలకు పంచేస్తా అని చెప్పారు. ఆ విద్యార్థే నంబాళ్ల కేశవరావు. విద్యార్థిగా ఊరి నుంచి, కుటుంబం నుంచి వెళ్లిన కేశవరావు విగతజీవిగా మారారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అజ్ఞాత వాసం చేసి అడవిలోనూ ఊపిరి వదిలేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో సిక్కోలు ఉలిక్కి పడింది. నంబాళ్ల స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చిన్నప్పుడు తెలివైన విద్యార్థి, మెరుగైన కబడ్డీ ప్లేయర్‌గా మన్ననలు అందుకున్న కేశవరావు కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామానికి చెందిన నంబాళ్ల వాసుదేవరావు (ఉపాధ్యాయుడు) లక్ష్మీనారాయణమ్మ దంపతులకు 1955లో జన్మించారు. 1 నుంచి 5 వరకు స్వగ్రామమైన జియ్యన్నపేటలో ప్రాథమిక విద్యనభ్యసించారు. ఆ తర్వాత 6 నుంచి 10 వరకు టెక్కలి మండలం తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్‌లో విద్యనభ్యసించారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసి 1971 లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ కోర్సులో చేరారు. ఏడాది తర్వాత వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరారు. ఆ తర్వాత అక్కడే ఎంటెక్‌లో చేరారు. అటు నుంచి అటే అడవి బాట పట్టారు. కేశవరావు మరణంతో కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ గ్రామం ప్రస్తుతం గుంభనంగా ఉంది. గతంలో ఒకటి రెండు మార్లు కేశవరావుమృతి వదంతులపై కొందరు స్పందించడంతో వారిని పోలీసులు విచారించారు. దీంతో ప్రస్తుతం ఎవరూ బయట పడడం లేదు.

ఉద్దానంలో..

నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారన్న వార్త ఉద్దానంలో దావానలంలా వ్యాపించింది. టెక్కలికి చెందిన ఆయనకు ఈ ప్రాంతం ఉద్యమాలతో నేరుగా సంబంధం లేకపోయినా ఈ ప్రాంతం మావోయిస్టు కేడరుకు, నాటి పీపుల్స్ వార్ పార్టీ కేడరుకు దిశానిర్దేశం చేసిన వ్యక్తి కావడంతో మృతి వార్తతో ఉద్దానం ఉలిక్కిపడింది. పోలీసు వర్గాలు ముందుగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి ఈ సమాచారం అందించి మృతదేహాన్ని తీసుకొని రావడానికి ఎవరైనా వెళ్తున్నారా అని అడిగారు. తమ గ్రామానితో ఎలాంటి బంధుత్వం లేదని, రాజకీయ బంధుత్వం మాత్రమే ఉందని వారు చెప్పారు. ఒక నాటి పీపుల్స్ వార్‌లో, నేటి మావోయిస్టు పార్టీలో పనిచేసి ఈ ఉద్దానం ప్రాంతంలో సుమారు 60మంది వరకు కార్యకర్తలు, నాయకులు పోలీసు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. నంబాళ్ల కేశవరావు మృతితో ఇక నాయకత్వ స్థానాల్లో ఈ జిల్లా నుంచి ఎవరూ లేరనే తెలుస్తోంది. ఆయన మృతదేహం తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, మాజీ మావోయిస్టు నాయకులు బయల్దేరి వెళ్తున్నట్టు ఉద్దానం వాసులు చెబుతున్నారు.



జియ్యన్నపేటలోని కేశవరావు స్వగృహం

ఎన్‌కౌంటర్‌కు ఖండన

చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ మఢ్ అడవుల్లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌ను సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఖండించారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు కోరినా వాటిని తిరస్కరించి మన దేశపౌరులైన మావోయిస్టులను ఉగ్రవాదులపై దాడుల కన్నా ఎక్కువగా దాడి చేసి దండకారణ్యంలో ఒక భయంకరమైన వాతావరణాన్ని సృష్టించడం అప్రజాస్వామికమని, పౌర సమాజం వీటిపై తీవ్రంగా స్పందించాలని కోరారు.



కేశవరావు మృతదేహం



మందుబాబే టార్గెట్

- జిల్లాలో చెలరేగిపోతున్న మద్యం సిండికేట్లు
- వీధికి నాలుగైదు బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తున్న పరిస్థితి
- మందుబాబుల ఇళ్ల దగ్గరే దొరికేలా బెల్ట్‌షాపులు
- ఎమ్మార్పీకి మించి విక్రయాలతో భారీగా లాభాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సామాన్యుడి ఇంటికి రేషన్ బియ్యం చేర్చడం ప్రభుత్వానికి కష్టమైపోయింది. కానీ మద్యాన్ని మాత్రం మందుబాబుల ఇంటి ముంగిటకు అందించడానికి సర్కారు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. జిల్లాలోని వైన్‌షాపుల్లో కౌంటర్ సేల్స్ తగ్గాయి. ఇది చూసి మద్యం విక్రయాలు తగ్గిపోయాయి అనుకుంటే పొరపాటే. అసలు వ్యాపారం అంతా బెల్టుషాపుల ద్వారానే నడుస్తోంది. దీంతో వ్యాపారులు కూడా వైన్‌షాపుల కంటే బెల్టుషాపులపైనే అధికంగా దృష్టి సారిస్తున్నారు. ఎక్కడ అమ్ముకున్నా విక్రయ సొమ్ము సిండికేట్లదే.

లాభాలు చాలవని..

లైసెన్సు వైన్‌షాపుల్లో ఎంఆర్‌పీకి విక్రయించాలి. కానీ ఆ లాభాల కిక్ వ్యాపారులకు ఎక్కడం లేదు. అంతకుమించి కావాలనుకుంటున్నారు. బెల్ట్‌షాపులే సరైన వేదికలని ఎంచుకున్నారు. దాదాపు మందుబాబుల ఇళ్ల దగ్గరే మద్యం దొరికేలా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తే ఎంత ధరకైనా కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా ఫలితాలు వస్తుండటంతో లైసెన్సు షాపుల కంటే బెల్ట్‌షాపులే మేలని నిర్ణయానికి వచ్చారు. ఇప్పుడా పనిలోనే మద్యం మాఫియా ఉంది.

సిండికేట్ల వ్యూహరచన


జిల్లాలో చాలావరకు లైసెన్సు షాపుల మంత్రులు, ఎమ్మెల్యే కుటుంబీకులు, బంధువుల చేతుల్లో ఉన్నాయి. ఇంకేముంది సిండికేట్‌గా అవతారమెత్తారు.



శ్రీకాకుళంలో బహిరంగంగా మద్యపానం

టౌన్‌లలో పర్మిట్ రూమ్‌లు

బెల్ట్‌షాపులే కాదు పట్టణాలు, నగరాల్లో వైన్‌షాపుల పక్కనే పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. 2014-19లో పర్మిట్ రూమ్‌కు రెండు లక్షల రూపాయల వరకు ప్రభుత్వం ఫీజు వసూలు చేసేది. ఇప్పుడా ఫీజు చెల్లించనవసరం లేకుండా ఎవరికి వారు పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకుని, బార్ అండ్ రెస్టారెంట్‌ల మాదిరిగా నడుపుతున్నారు. మందు, ముక్క ఒకే దగ్గర దొరుకు తుండటంతో మందుబాబులకు పండగే పండగ. నిషా మత్తులో ఎంత దోచుకుంటున్నా గుర్తించలేని పరిస్థితులో మందుబాబులు ఉంటున్నారు. మొత్తానికి అన్ని రకాలుగా మద్యం ముసుగులో దోపిడీకి పాల్పడుతున్నారు.



తమ అనుచరులు, నాయకులు, కార్యకర్తల షాపులను కూడా సిండికేట్‌లో కలిపేసుకున్నారు. తటస్తులు, వ్యాపారస్తులు, ఇతరత్రా వ్యక్తుల వద్ద ఉన్న షాపుల్లో చాలా వరకు భయపెట్టి గుడ్‌విల్ కింద, షేర్ కింద తమ గుప్పెట్లో తెచ్చుకున్నారు. ఇక, ఎక్కడైనా ఒకటో, రెండో షాపులు మిగిలిపోతే చేసేదేమీ లేక వారు కూడా సిండికేట్‌లో చేరిపోక తప్పలేదు. వీరికి దూరంగా ఉంటే టార్గెట్ అవుతామని, అసలుకు ఎసరొస్తుందనే భయంతో సిండికేట్‌లో చేరిపోయారు. ఇప్పుడంతా సిండికేట్ రాజ్యమేలుతోంది. ఆ క్రమంలో కొన్ని నియోజకవర్గాల్లో లైసెన్సు దుకాణాల కౌంటర్లలో ఎంఆర్‌పీకి మించి రూ. 10, 20వేసుకుని విక్రయిస్తున్నారు. అయినా చాలకపోవడం వలన బెల్ట్‌షాపులైతే భారీగా ఆర్జించొచ్చని ప్రణాళిక రచించారు. దాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు.

అంతకుమించి..

2014-19లో ఎలాగైతే బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఏర్పాటై మందుబాబుల్ని పీల్చేశాయో ఇప్పుడదే విధంగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. అప్పట్లో గ్రామానికి నాలుగో ఐదో బెల్ట్‌షాపులుండేవి. ఇప్పుడు అంతకుమించి నడుపుతున్నారు. వీధికి నాలుగైదు బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి, దాదాపు మందుబాబుల ఇళ్ల వద్దే విక్రయిస్తున్నారు. ఇవన్నీ సిండికేట్ల ఆధ్వర్యంలో నడుపుతున్నారు. లైసెన్సు షాపుల నిర్వాహకులే నేరుగా డోర్ డెలివరీ చేసినట్టు బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్నా రు. ఎంత కావాలంటే అంత సప్‌లై చేస్తున్నారు. ఇంకేముంది ఇంటి దగ్గరకే మద్యం దొరకడంతో మందుబాబులు కూడా ధరను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 20నుంచి రూ.50 వరకు పెంచి విక్రయిస్తున్నారు. దీంతో భారీగా లాభాలను ఆర్జిస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో మందుబాబులు కూడా దోపిడీకి గురవుతున్నారు.



జిల్లా కేంద్రంలోని ఓ వైన్ షాపు వద్ద పరిస్థితి..

నా పోర్టు పరిహారం ఏమైంది..?

- టీడీపీ కార్యకర్త ఆవేదన

సంతబొమ్మాళి: మూలపేట పోర్టుకు సంబంధించి రెండోసారి ఎకరాకి రూ.12లక్షల 50వేలు చొప్పున ఇచ్చిన పరిహారం ఏమైందంటూ టీడీపీ కార్యకర్త జీరు ధర్మారావు ప్రశ్నించారు. ఆయన బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని తాను వ్యతిరేకించానని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భూములు ఇవ్వడానికి సంతకం కూడా చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు చివరలో సంతకం చేశానని అన్నారు. తనకు ఎకరా 30 సెంట్లు భూమి ఉంటే 83 సెంట్లకే రూ. 21లక్షల 25వేలు పరిహారం మొదటి విడతగా ఇచ్చారని తెలిపారు. రెండోవిడతగా 23 టీడీపీ కుటుంబాలకు ఎకరాకి రూ.12లక్షల50వేల పరిహారం ఇచ్చారని, తన పరిహారం ఏమైందని స్థానిక టీడీపీ నాయకులను అడిగితే నీ చెక్కు ఫలానా టీడీపీ నాయకుడి దగ్గర ఉంది తీసుకో అని చెప్పి వాళ్ల ఇళ్ల చుట్టూ పలు దఫాలు తిప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలి ఆర్డీఓ, నౌపడ ఎస్ఐలను బుధవారం కలిసి తన బాధను చెప్పినా వాళ్లు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పోర్టుకు మన భూములు ఇవ్వద్దు మన భూముల్లో అందరం కలిసి వరినాట్లు వేద్దాం, ధర్నాలు చేద్దామని తన కుటుంబం దగ్గర రూ. 7వేలు చొప్పున తీసుకున్నారని, ఆ డబ్బులు కూడా ఇచ్చి వరి నాట్లు వేశానని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తనను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతగా వచ్చిన పరిహారాన్ని కలెక్టర్ స్పందించి ఇప్పించాలని ధర్మారావు కోరారు.



మాట్లాడుతున్న టీడీపీ కార్యకర్త జీరు ధర్మారావు

జూన్ 21 వరకు యోగాంధ్ర



అరసవల్లి: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరిట ప్రత్యేక యోగాసనాల కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూన్ 21న ప్రధాని మోదీ విశాఖ రానున్నారని తెలిపారు. ఇక బుధవారం నుంచి గ్రామ స్థాయి, మండల, జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుందని, ఇందుకోసం ఒక్కో యోగా ట్రైనర్‌ను నియమిస్తామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ యోగా మాస్టర్‌గా తన అనుభవాన్ని వివరించారు. అంతకుముందు జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రముఖులంతా స్వయంగా పాల్గొని యోగాసనాలను వేశారు. అయితే మంగళవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించడంతో బుధవారం ఉదయం భక్తులు దర్శనాలకు ఇబ్బందులు పడ్డారు. అయితే పరిస్థితిని గమనించిన ఆలయ అధికార సిబ్బంది శివాలయం మీదుగా దర్శనానికి పంపించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత, యోగా టీచర్లు పొంద్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, ఎ.గాయత్రి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తూ..



ఆసనాలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

ప్రయాణికులతో కాంప్లెక్స్ కిటకిట

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించింది. బుధవారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అమ్మవారి పండగలు కావడంతో వాటికి హాజరయ్యేందుకు దూరప్రాంతాలు నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించారు. అయితే రద్దీకి తగ్గట్టు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రధానంగా సాలూరులో అమ్మవారి పండగలు జరుగుతుండడంతో అక్కడకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి సగానికి పైగా బస్సులు వెళ్లిపోవడంతో స్థానికంగా కొరత ఏర్పడింది. కొత్తూరు, బత్తిలి, పాతపట్నం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో విపరీతమైన రద్దీ కనిపించింది.

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫుట్‌పాత్‌లపై బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు





పాతపట్నం బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

జిల్లాస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సీనియర్స్ స్విమ్మింగ్ ఎంపిక పోటీలను ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అడప రఘునాథ్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా రేపు ఉదయం 8 గంటల నుంచి ఈ ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను జూన్ ఒకటో తేదీన పల్నాడు జిల్లా నరసారావుపేట వేదికగా జరిగే 11వ ఏపీ సీనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామన్నారు.

క్లుప్తంగా

9.2 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు 9.2 కిలోల గంజాయి తరలిస్తున్న గమేష్‌నాయిక్ అనే వ్యక్తిని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు జరుపుతుండగా గమేష్‌నాయిక్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతనిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 9.2 కిలోల గంజాయి పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం గేరేగేడి గ్రామానికి చెందిన ఈయన కుటుంబ పోషణకు డబ్బులు చాలక గంజాయి రవాణాకు దిగాడు. కంధమల్ జిల్లా తిలోరి గ్రామానికి చెందిన అజిత్‌ప్రధాన్, సుభాష్‌ల వద్ద కిలో గంజాయి రూ.రెండు వేలకు కొని మైసూర్‌లో బబ్లూకుమార్‌కు కిలో రూ.పది వేలకు అమ్మడానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ తనిఖీలలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డివాములు

కాశీబుగ్గ: పలాస మండలం అమలకుడియా పంచాయతీ పూర్ణభద్ర గ్రామ సమీపంలో గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తగలబెట్టారు. గ్రామానికి చెందిన కాయల హరికృష్ణతో పాటు మరో రైతుకు చెందిన ఐదెకరాల గడ్డివాములు ఈ ఘటనలో కాలిబూడిదయ్యాయి. పశువులకు ఏడాది పాటు సరిపడా గడ్డివాములు దగ్ధం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

సిక్కోలు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



అవార్డు అందుకుంటున్న బుడుమూరు ఉదయకిరణ్

బూర్జ/మందస/జలుమూరు: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం తరపున షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వీరంతా మంగళవారం రాత్రి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న వారిలో మందస మండలం హరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కంచరాన జ్యోషిత(597), బూర్జ మండలం ఓ.వి.పేట మోడల్ స్కూల్ విద్యార్థి బుడుమూరు ఉదయకిరణ్(593), జలుమూరు మండల కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థిని రావాడ హేమశిరీష(592) ఉన్నారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

- తెలుగు మాధ్యమానికి చంద్రబాబు సర్కారు మంగళం
- బడుల్లో తెలుగు మీడియం లేదంటూ ఉత్తర్వులిచ్చిన పాఠశాల విద్యాశాఖ
- ఇప్పటికే ఇంటర్‌లో తెలుగు సబ్జెక్టును ఆప్షనల్ చేసిన కూటమి ప్రభుత్వం
- మండిపడుతున్న భాషాభిమానులు



ఇంటర్మీడియెట్‌లో తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయాలని ధర్నా చేస్తున్న అధ్యాపకులు(ఫైల్)

ఎందుకీ తెలుగు ద్వేషం?

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడులలో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్సీ సిలబస్‌ల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలుగు మాధ్యమానికి తూట్లు పొడుస్తోందని గత ఐదేళ్లగా అక్కసు వెళ్లగక్కిన కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు మాధ్యమానికి మంగళం పాడేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేదంటూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు కలిపి 2,638 ఉండగా.. అందులో 1,61,151 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఇంటర్‌లోనూ తెలుగును ఐచ్ఛికం చేస్తూ..

ఇంటర్మీడియెట్‌లో సైతం ఇన్నాళ్లు తప్పనిసరిగా ఉన్న తెలుగు సబ్జెక్టును.. ఐచ్ఛికం చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి తెలుగు అధ్యాపకులంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న రోజుల్లో తెలుగు మాధ్యమానికి అన్యాయం చేస్తున్నారని.. తెలుగులోనే బోధన, చదువులు కొనసాగాలని గగ్గోలు పెట్టిన కూటమి పార్టీల పెద్దలు, నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక తమ స్వరం మార్చుకుంటున్నారు. తాజాగా పాఠశాల



తెలుగు అక్షరమాల

విద్యాశాఖ తెలుగుమాధ్యమం లేదంటూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల తెలుగుభాషాభిమానులు, ఏపీ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ ప్రతినిధులు మండిపడుతున్నారు.

నాడు తెలుగుకు అన్యాయం జరగకుండా..

తెలుగు సబ్జెక్టుకు అన్యాయం జరగకుండా.. తెలుగును సబ్జెక్టును తప్పనిసరి చేస్తూనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంను తీసుకొచ్చింది. పేద, మధ్య తరగతి పిల్లలు పోటీ ప్రపంచంతో పోటీపడి రాణించాలని ఆనాడు ఇంగ్లీషు మీడియంలో చదువు, సీబీఎస్సీ సిలబస్ అమలు విషయంలో ఎవరెన్ని చెప్పినా ఆనాటి గత సర్కారు వెనక్కి తగ్గలేదు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులను కూడా తెలుగు మాధ్యమంలో బోధించాలని పేర్కొంటే.. రాష్ట్రంలో మాత్రం పాఠశాలల్లో ఆ నిబంధనలను ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలు తమ మాతృభాషకు అగ్రతాంబూలమిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం మాతృభాషను పట్టించుకునే వారే లేకపోవడం బాధాకరమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ అధ్యక్షులు పిసిని వసంతరావు, ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు, ముఖ్య ప్రతినిధులు పూడి లక్ష్మీపతి, పట్నాన వెంకటరమణ, కుప్పన్నగారి శ్రీనివాసరావు, గోడబ మేరీప్రసాద్, సీహెచ్ జనార్దన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే..

- తెలుగుభాష పట్ల గౌరవం ఉంటే తక్షణం పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి.
- విద్యార్థుల రేషియో ఆధారంగా బడుల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి.
- తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి, ఉద్యోగాలు పొందేందుకు 2% రిజర్వేషన్ కల్పించాలి.
- డిగ్రీ వరకు తెలుగును ఐచ్ఛికం కాకుండా.. తప్పనిసరి సబ్జెక్టుగా తీసుకురావాలి.
- ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ కళాశాల స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలి.

తెలుగు టీచర్లు లేకుండా బోధనెలా ?

ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు టీచర్లు ఉండరా ..? అంటే అవుననే సమాధానం పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. ఈ మేరకు పునర్వ్యవస్థీకరణ జీవోలో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు బోధకులు పాఠశాలలకు కేటాయించకుండా మార్గదర్శకాలను వెలువరించింది. అసలు ప్రభుత్వం ఉద్దేశం ఏంటో.. పాఠశాలలను, విద్యార్థులను విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం ఏం చేయాలని ఆలోచన చేస్తుందో అర్థంకావడం లేదని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. 2001లో విస్తృతంగా ప్రాథమికోన్నత పాఠశాలలు నెలకొల్పినప్పుడు ఏర్పాటైన స్టాఫ్ ప్యాటర్న్‌ను.. 2025 వరకు కొనసాగించడం ద్వారా మెరుగైన విద్యా ప్రమాణాలు సాధ్యమయ్యాయి. తాజాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు పోస్టును ఎత్తివేయడం వారి దురుద్దేశాన్ని తేటతెల్లం చేస్తోంది. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల తెలుగు బోధనను ఎవరు చేపడతారో ప్రశ్నార్థకంగా మారిందని భాషాభిమానులు, రాష్ట్ర భాషోపాధ్యా సంస్థ జిల్లాశాఖ నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తీవ్ర అన్యాయం..



రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమానికి పాతరేసేలా కూటమి ప్రభుత్వం దుందుడుకు చర్యలు చేపడుతోంది. విద్యాశాఖ తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమం లేదంటూ పేర్కొనడం విచారకరం. కూటమి ప్రభుత్వం ఆనాడు చేసిన ప్రకటనలకు ప్రస్తుతం పూర్తి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం తగదు.

– పిపిసి వసంతరావు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు

తెలుగుకు వెలుగేదీ?



నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీల పెద్దలు, నాయకులు.. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంగ్లీషుమీడియం, సీబీఎస్సీ సిలబస్ పట్ల.. అనరాని మాటలు అన్నారు. ఆ వాఖ్యలు, ప్రకటనలను ఒకసారి గుర్తుచేసుకోవాలి. తీరా అధికారంలోకి వచ్చాక తెలుగు మాధ్యమాన్ని అధఃపాతాలానికి తొక్కేయాలని చూస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేయాలి.

– కూన రంగనాయకులు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి

పునర్వ్యవస్థీకరణలో తీవ్ర అన్యాయం..

పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుంచి 8 తరగతులు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుల పోస్టులను తీసేయడం తీవ్ర అన్యాయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ప్రతినిధులు మండిపడుతున్నారు. 8వ తరగతి తర్వాత రాబోయే పదో తరగతిలో తెలుగు ఉత్తీర్ణత ప్రభావితం కానుందని గుర్తుచేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీ నాయకులు మాటలు, ప్రకటనలు విని నిలువునా మోసపోయామని తెలుగు భాషాభిమానులు, తెలుగు ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

• అష్ట ఫలాలతో శిఖరాభిషేకం



జిల్లా కేంద్రంలోని పుణ్యపువీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్సల అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం మహాకుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖరానికి అష్ట ఫలాలతో అభిషేకం చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

ఆర్టీసీ బస్సు- ఆటో ఢీ

- డ్రైవర్‌తో సహా 12 మందికి గాయాలు

గార: కళింగపట్నం నుంచి బందరువానిపేటకు వెళ్లే రోడ్డులో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌తో సహా 12 మందికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బందరువానిపేటలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది కుందువానిపేట పండగకి వెళ్లి తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరారు. అదే సమయంలో కె.మత్స్యలేశం గ్రామశివారులోని మలుపు వద్ద బందరువానిపేట నుంచి వస్తున్న ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను రెండు అంబులెన్సుల ద్వారా తొలుత కళింగపట్నం పీహెచ్‌సీకి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరిలో గనగళ్ల లక్ష్మీ, దేవిశ్రీ కాలుకు గాయాలవ్వగా.. అప్పారావుకు బలమైన గాయమైంది. డ్రైవర్‌తో పాటు మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. గార ఏఎస్ఐ ఎం.చిరంజీవులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు.



ప్రమాదానికి గురైన ఆటో, ఆర్టీసీ బస్సు

పశువుల వాహనం సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం నవభారత్ సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నారు. 19 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న గొర్లె బాబ్జీపై కేసు నమోదు చేశారు. పశువులను కొత్తవలస గో సంరక్షణ కేంద్రానికి తరలించారు.

రావివలసలో మహిళపై దాడి

టెక్కలి రూరల్: రావివలస గ్రామానికి చెందిన కె.శకుంతల అనే మహిళపై బుధవారం ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల సందర్భంగా బాధిత మహిళ ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో భోజనాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలానికి సంబంధించి చిన్న పాటి వాగ్వాదం జరగడంతో మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అనంతరం బాధితురాలిని చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

వలస కార్మికుడు దుర్మరణం

హిరమండలం: వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ నిర్మాణ పనులకు వచ్చిన ఓ వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ నిర్మాణ పనులకు ఇటీవల ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారికి హిరమండలంలో సంబంధిత కాంట్రాక్టర్ వసతి కల్పించారు. మేజర్ పంచాయతీలోని ఓ ఇంట్లో చాలామంది కార్మికులు ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాకు చెందిన కమలేష్‌ఠాకూర్ (41) అనే కార్మికుడు నిద్రమత్తులో డాబా పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కమలేష్ బుధవారం మృతిచెందాడు. దీంతో నాగపూర్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. హిరమండలం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీల్లో) ప్రవేశాలకు స్వీకరించిన దరఖాస్తులు స్వీకరణ మంగళవారంతో పూర్తయినట్లు శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ చెప్పారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ప్రకాశం క్యాంపస్‌లకు కలిపి 48,891 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. స్థానిక క్యాంపస్‌లో 1100 మందికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో ప్రవేశాలు లభిస్తాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ జాబితాను జూన్ 5న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో క్యాప్ (సైనికోద్యోగుల పిల్లల) ధ్రువీకరణ పత్రాలు, 28 నుంచి 30 వరకు క్రీడా కోటా విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, 29న భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోటా విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, 29 నుంచి 31వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్హత సర్టిఫికెట్స్ పరిశీలన ఉంటుందని వివరించారు. పదో తరగతి మార్కుల ప్రతిభ, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు.

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

కాశీబుగ్గ: జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాలు వద్ద కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జీడి రైతుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో జీడి రైతు సంఘం నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ, టి.రాజు, డి.తారకేశ్వరరావు, జె.సంతోష్, టి.తాతారావు, సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధులు

27న అమరవీరుల స్మారక సభ

పలాస: శ్రీకాకుళం జిల్లా గిరిజన సాయుధరైతాంగ పోరాటంలో అమరులైన అమర వీరుల స్మారక సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద బుధవారం స్మారక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా మే 27న బొడ్డపాడులో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జోగి కోదండరావు, వంకల మాధవరావు, దుష్యంతు, రామారావు, వీరాస్వామి, ధర్మారావు, పుచ్చ దుర్యోధన, బాలకృష్ణ, త్రిలోచనరావు, శ్రీరాములు, మోహిని, జగన్,అప్పయ్య, బాలరాజు, అప్పారావు,మాధవరావు, ముసలయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

రణస్థలం: మండలంలోని మెంటాడ పంచాయతీ దోనిపేట సముద్రంలో గల్లంతైన నిద్రబంగి సంతోష్ మృతదేహం అదే ప్రాంతంలో బుధవారం లభ్యమైంది. నారువ గ్రామానికి చెందిన సంతోష్ (31)తో పాటు ఆళ్ల సూర్యనారాయణ, నీలాపు రమణ మంగళవారం సముద్ర స్నానానికి వెళ్లగా అందులో సంతోష్ గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం మృతదేహం ఒడ్డుకు రావడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌లో శవపంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

అవగాహనతోనే నకిలీలకు అడ్డుకట్ట

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి
- కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరి

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ సమీపిస్తుండటంతో రైతులు పొలం పనులకు సమాయత్తమవుతున్నారు. పంట దిగుబడి చేతికి అందివచ్చే వరకు ప్రతి రోజు పొలంలో ఏదో ఒక పనిచేస్తునే ఉంటారు. రానున్న జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ విత్తనాలు చల్లే పనులు ప్రారంభం అవుతాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అంటగట్టి అందినంత దోచుకునేందుకు అదునుగా ఎదురుచూస్తున్నారు. వీరి బారిన పడకుంటా ఉండాలంటే రైతులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వ్యాపారులు చేస్తున్న అక్రమాలను గుర్తించి ప్రశ్నించగలరని అధికారులు చెబుతున్నారు.

అన్నింటా మోసం..

విత్తనాలు కొనుగోలు చేసి పొలంలో వేసుకున్న తరువాత మొలకలు పూర్తిగా రాకపోవడం, తక్కువ శాతం మొలకలు రావడం జరిగితే నాశిరకం విత్తనాలు ఇచ్చి వ్యాపారి తనను మోసం చేశారని రైతులు అనుకుంటారు. ఒక్క విత్తనాలే అనుకుంటే పొరపాటే. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుల మందులు.. ఇలా ప్రతి వ్యాపారంలోనూ మోసాలు జరుగుతుంటాయి.

పరిశీలన తప్పనిసరి..

ప్రభుత్వ అనుమతి పొంది వ్యాపారం చేస్తున్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదులు (బిల్లులు) ఇవ్వని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయకపోవడమే మంచిది. కొనుగోలు చేసిన విత్తనాల సంచుల(బ్యాగ్)కు సీల్ వేసి ఉన్నాయో? లేదో? చూసుకోవాలి. సీల్ వేసి ఉన్న సంచులనే కొనుగోలు చేయాలి. సంచులపై కంపెనీ పేరు, తయారీ, గడువు తేదీలు, నికర బరువు, విత్తన రకం, తేమ శాతం.. తదితర అంశాలను సరిచూసుకోవాలి.

పొలంలో విత్తనాలు వేసుకున్న తరువాత సంచులను, రశీదులను, సంచులపై ఉన్న సమగ్ర వివరాలను తెలియజేసే పత్రాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో మోసం జరిగితే వినియోగదారుల చట్టం ప్రకారం పరిహారం పొందేందుకు ఇవే కీలకమవుతాయి.



విత్తనాలు వేసేందుకు పొలం దుక్కి చేస్తున్న రైతులు



వరి విత్తనాల బస్తాలు

నకిలీలను గుర్తిస్తే..



పొలంలో వేసిన విత్తనాలకు మొలకలు రాకపోతే నకిలీ విత్తనాలుగా భావిస్తారు. దిగుబడి పూర్తిగా రాకపోయినా నకిలీ విత్తనాలుగానే భావించవచ్చు. వెంటనే వ్యవసాయ శాఖ ఏఓ, ఏడీ, పోలీసులకు అన్ని రకాల రశీదులతో రైతుకు జరిగిన నష్టాన్ని, విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశారో తెలియజేస్తూ ఫిర్యాదు చేసి రశీదు ఉంచుకోవాలి. పంటను పరిశీలించి ధృవీకరించేందుకు శాస్త్రవేత్తలను అధికారులు తీసుకొస్తారు. పోలీసుల, వ్యవసాయాధికారులు ఇచ్చిన నివేదికల మేరకు వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

– పైడి లతశ్రీ, మండల వ్యవసాయాధికారి, ఎల్.ఎన్.పేట

ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు తగదు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజలకు ఐదేళ్లుగా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లను కూటమి ప్రభుత్వం తొలగించడం తగదని ఎండీయూ ఆపరేటర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి బుధవారం ఎన్జీవో హోంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,260 మంది ఎండీయూ ఆపరేటర్లు, 9,200 సహాయకులు పనిచేస్తున్నట్లు చెప్పారు. వీరు విధుల్లో చేరిన సమయంలో 72 నెలలు అగ్రిమెంట్ ఉందన్నారు. ప్రస్తుతం మరో రెండేళ్ల పాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉందన్నారు. రాత్రికి రాత్రి ఉన్న ఫలంగా తొలగించడం సబబు కాదన్నారు. ఈ నిర్ణయాల వల్ల 18,500 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో ఒక్కో ఆపరేటర్ 1500 నుంచి 2000 ఇళ్లకు వెళ్లి ప్రాణాలను పణంగా పెట్టి నిత్యావసర సరుకులు అందించారని గుర్తు చేశారు. బ్యాంకుల ద్వారా వాహనాలకు తీసుకున్న రూ.1,90,000 బకాయిలు ఉందని, వీటిని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పక తొలగించాల్సి వస్తే కార్మిక చట్టం ద్వారా ఆరు నెలలు జీతాలను ముందే చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు హేమసుందర్, వరహా నర్సింహులు, వెంకట్రావు, అప్పలనాయుడు, రవి, వాసు గోపి, రామారావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

నందిగాం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవాన్ పిన్నింటి దొరబాబు అంత్యక్రియలు స్వగ్రామం పెంటూరులో పోలీస్ లాంఛనాలతో మధ్య ముగిశాయి. మంగళవారం సాయంత్రం నరసన్నపేట వద్ద జాతీయ రహదారి వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దొరబాబు మృతి చెందిన విషయం విదితమే. బుధవారం నరసన్నపేటలో పోస్ట్‌మార్టం అనంతరం స్వగ్రామానికి చేరుకున్న దొరబాబు మృతదేహానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. తండ్రి సదానందం తలకొరివి పెట్టగా పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. అనంతరం భార్య కాంచనకు జాతీయ పతాకం అందజేశారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు